కథ

# వెర్రి తండ్రి

ఐ. కవిత

డ్రెసింగ్ క్యూబికల్ నుంచి మాధవ్ బయటకు రావడమే తడవుగా అందుకోసమే ఎదురు చూస్తున్నట్లు ఆత్రంగా అడిగాడు జార్జ్.

"ఏమయింది మధూ నీకు?"

మాధవ్ భుజం మీద చెయ్యివేసి మరీ ప్రశ్నించిన జార్జిలో ఎంత కుతూహలమో అంత స్నేహ భావమూను.

"ఏమీలేదు-" అనేశాడు మాధవ్.

"ఏమీ జరగకుండానే నీ ముఖం అలా వాడిపోయిందా? కడుక్కున్నా మిగిలిపోయిన కన్నీటి చారికలే చెబుతున్నాయి కచ్చితంగా ఏదో జరిగిందనీ, అది సామాన్యమయినది కాదనీ.."

అప్పటికీ మాధవ్ ఏమీ అనలేదు.

"ఆర్చేవాడినీ తీర్చగలిగేవాడినీ కాగలిగినా మానినా... నేను నీకు కనీసం స్నేహితుడయినా కానా? విషయం చెబితే - నీ బాధ నేనూ పంచుకుంటాను. స్నేహానికీ చిన్నపాటి శక్తయినా ఉండదూ? మాధవ్, నేను నీ స్నేహితుణ్ణనే అనుకుంటున్నాను. పోనీ... సహోద్యోగిగానయినా..." జార్జి కంఠంలో కొంచెం నిష్ఠురత. మాధవ్‌లో చలనం కలిగినట్లు గోడ గడియారం వేపు చూశాడు. అదే అదునుగా తీసుకుని- "డ్యూటీకింకా చాలా వ్యవధి ఉందిలే. అటుపద... అక్కడ ఏకాంతంగా ఉంటుంది-" అంటూ మాధవ్ చేయి పట్టుకుని ఆ మూలకి నడిపించాడు జార్జ్. స్నేహపూరితమయిన ఆ స్పర్శకు మరింత కరిగిపోయాడు మాధవ్. ఇంకెవరూ లేని ఆ మూలకు చేరాక -

"ఊఁ... చెప్పు..." మెల్లగా అన్నాడు జార్జ్.

"అమ్మ..." మాధవ్ కంఠం గద్గదికమయింది.

"ఏమైంది?" ఆత్రంగా చూశాడు జార్జ్.

"ఆహ.. ఆమెకేమీ కాలేదు.. నేను.. తండ్రి నెరుగని కొడుకుని..."

కృత్యాద్యవస్థలోని గాయకుడిలా గిలగిలలాడాడు మాధవ్ తాను చెప్పదలుచుకున్నది మొదలు పెట్టేందుకు. "పుడుతూనే నాన్న గారిని మింగేసి - అమ్మని ఒంటరినీ విధవనీ చేసిన దుష్ట జాతకుణ్ని నేను."

"సారీ.."

"నెవర్‌మైండ్. అది.. ఎప్పుడో తప్ప జ్ఞాపకం రాని గతమే. ఫరవాలేదు..."

"తరవాత?"

"మామూలు మధ్య తరగతి కథే. ఆపదలో ఆదుకునే ఆప్తులు లేక.. ఒంటరిగా.... భర్త వదిలిన కొద్దిపాటి ఆస్తినే ఆసరాగా చేసుకుని.. కష్టపడుతూ.. కొవ్వొత్తి ఐ కొడుకుని బాగా చదివించడానికి రాజాలా పెంచడానికీ నానా అగచాట్లూ పడింది అమ్మ. ఆమెకు అక్షరమ్ముక్క రాకపోయినా నన్ను మాత్రం బాగా చదివించింది. నాన్న గారున్నా ఆమెకంటె ఎక్కువ చేయగలిగేవారు కారేమో. నేను బి.కామ్.తో ఆపేస్తానన్నాససేమిరా ఒప్పుకోలేదు.

నేను కలక్టర్‌నో తాసిల్దార్‌నో కావాలంది అక్కడికవే ఉద్యోగాలయినట్లూ మరేవీ కానట్లూ.."

జార్జి నవ్వాడు. "ఆకాలం వాళ్లంతేలే. వాళ్ల కిప్పటి పరిస్థితులూ, నిరుద్యోగ సమస్యా ఏమీ తెలియవు. ఊఁ.... చెప్పు."

"నిజానికి - ఈ ఉద్యోగంలో చేరిన మొదట్లో నేనూ చాలా బాధపడేవాడిని. బి.కామ్, ఎం.బి.ఏ., కంప్యూటర్స్, టైపింగ్.. యిన్ని విద్యార్హతలనూ దాచుకుని యిలాటి ఉద్యోగంలో చేరానే అని. నా డిగ్రీలూ, డిప్లొమాలూ -"

"అవి తెలిస్తే నీకిక్కడ ఈ ఉద్యోగం వొచ్చేది కాదు"

"ఔను. అందుకే - వొట్టి గ్రాడ్యుయేట్‌నని చెప్పుకున్నాను. ఏంచేసేదీ? నిరుద్యోగం భరించలేని శాపమాయె." నిట్టూర్చాడు మాధవ్.

"నువ్వీ ఉద్యోగం చేస్తున్నందుకు విచారిస్తున్నావా? పశ్చాత్తాపపడుతున్నావా?"

"ఎంత మాత్రమూ లేదు. నిరుద్యోగం కంటే ఇది చాలా నయం. డిగ్నిటీ ఆఫ్ లేబర్ చదివిన వాడిని. ఎంత సామాన్యమయిన పనినయినా ఎంత అసామాన్యంగా చేశావనేదే ముఖ్యం - లాటి సూక్తులు వినినవాడిని. పైగా.." మాధవ్ కొంచెం సిగ్గుపడుతూనూ మెల్లగానూ అన్నాడు. "నాకు - కొంచెం ఆత్మవంచనా అలవాటే."

"తప్పదులే. - జీవితమన్నాకా మనిషయి నాకా.. - ఊఁ.. చెప్పు.."

"నా ఉద్యోగం.. అదే.. నేను చేసే పని.. గురించి మా అమ్మకేమీ తెలియదు. పాతకాలపుది కదా.. పిండి కొద్దీ రొట్టిలాగే చదువు కొద్దీ ఉద్యోగమనుకుంటుందా సత్యకాలపు మనిషి. నెల నెలా ఐదువేలందిస్తూంటాను.."

"నువ్వు టిప్పు సుల్తాన్‌వి మరి -" నవ్వాడు జార్జి.

"ఎం.బి.ఏ. చదువు నాకు మేనేజ్‌మెంట్‌కి పనికి రాలేదు కానీ కస్టమర్ సర్వీస్‌కి బాగా ఉపకరించింది. నేనెన్ని భాషలలో సర్వ్ చేస్తానని? ఇంగ్లీష్.. తెలుగు.. హిందీ.. అన్నట్లు నేను కేవలమూ యీ ఉద్యోగం కోసమే తమిళం కూడా నేర్చు కున్నాను. కస్టమర్‌లకు వారి భాషలో సేవలం దిస్తే మరింత సంతోషిస్తారు. అందుకే నాకు భారీగా టిప్పులందుతాయి. సంపాదననే పరిగణిస్తే నేను పెద్ద ఆఫీసర్‌తో సమానమే. కానీ - అమ్మ అర్థం చేసుకునే విలువలు వేరు-"

"అంటే?"

"ఆవిడకు తెల్ల చొక్కా ఉద్యోగాలంటేనే ఉద్యోగాలు - వాటిలో కూహనా గౌరవమే తప్ప జీతం ఎక్కువ కాకపోయినా, నేను వేసుకునే ఖరీదయిన దుస్తులూ.. మానేజ్‌మెంట్ నన్ను యింటి నుంచి కారులో తీసుకెళ్లి మళ్లీ యింటికి కారులో దిగ బెట్టడమూ.. యివన్నీ ఆమెను నా గురించి తీయని ఉన్నతమైన ఊహలలో ఉంచుతూ వచ్చాయి -"

"మరి ఆమె నిన్నెప్పుడూ అడగలేదూ నీ ఉద్యోగమేమిటని?"

"అడిగింది. ఇంపీరియల్ అని గొణిగాను వినీ వినపడకుండానూ ఆవిడకర్థం కాకుండానూ. నిజం చెప్పడానికి నా అహమే అడ్డు పడిందో, అనవసరంగా అప్రియమయిన నిజం చెప్పి అమ్మనెందుకు బాధ పెట్టాలనుకున్నానో.." తలవొంచుకున్నాడు మాధవ్ - చేసిన తప్పుకి.

"ఊఁ" జాలిగా నిట్టూర్చాడు జార్జ్. మాధవ్ మళ్లీ చెప్పసాగాడు.

"ఇక పెళ్లి నస మొదలు పెట్టిందమ్మ. ఉద్యోగమూ వయసూ వొచ్చేయి. పెళ్లి చేసుకో అని పోరడం ప్రారంభించింది."

"నిజమే. చేసుకోవచ్చుగా? తాత్సారం దేనికీ?"

జార్జి ప్రశ్నను వినిపించుకోకుండా- "పుత్రోత్సాహము తండ్రికి, అన్నారు కానీ నిజానికి పుత్రోత్సాహం తల్లికే ఎక్కువేమో. నిన్ను ఉద్యోగిగా చూడాలని కోడలూ నువ్వూ కలకల లాడుతూంటే చూసి మురియాలనీ కాకపోతే నేను బతికిందెందుకూ? ఒక్కసారి నన్ను నీ ఆఫీసుకు తీసుకెళ్లి చూబించరా. నా కోరిక -నా కోసమే కాదురా... నన్ను నీతో నీకారులో ఆఫీసుకి తీసుకెళ్లావనుకో, చుట్టు పక్కల వాళ్లంతా శాంతమ్మ కొడుకెంత మంచి వాడూ, యీ కాలప్పిల్లల్లాకానేకాదు. వాళ్లమ్మని కారులో తీసుకెళ్లి ఆఫీసు చూబించాడు - అని నిన్నూ నన్నూ కూడా గొప్పగా చెప్పుకుంటారు. నిన్ను నలుగురూ మెచ్చుకుంటే నా మనసుకెంత తీయన! ఆఫీసుకి తీసుకెళ్లరా ఓసారి' అని సూటిగానే అడిగింది. నేను వినిపించుకోకపోయేసరికి నా మీద అలిగి అన్నం మానేసింది - ఆవిడ చేత అన్నం ముట్టించేందుకు నిన్న రాత్రి అలాగే అనక తప్పలేదు. ఇక చూడాలి, తెల్లవారిన దగ్గర నుంచీ ఆమె సందడీ సంబరమూ. నాన్న చనిపోయినా.. పెళ్లిది మిగిలిన కనకాంబరం రంగు పట్టుచీర పెట్టిలోంచి తీసి దులిపింది. సగం పండిన కాస్త జుత్తునే ముడేసుకుంది. ఆయన పోయిన యిన్నాళ్లకు మళ్లీ అద్దం చూసుకుంది. తయారైంది. ప్రయాణమో సినిమాయో అంటే చిన్న పిల్లలు సంబర పడిపోతారే అలాగే హడావిడి పడిందంత పెద్దావిడ కూడా. ఆవిడ తొందరపడి ఊరు కోకుండా - నన్నూ కంగారు పెట్టయ్య సాగింది తెమలమని. నా వేళ నాకు తెలియదా? మనం తొందరపడినా గడియారం తొందరపడదు కదా? నిజానికివాళ ఎందుకనో కారు ముందుగానే వొచ్చింది - పదినిము



షాలు. 'కారొచ్చేసిందిరా మాధవా' అంటూ అరిచిందమ్మ. నేనాలస్యం చేస్తే అమ్మ యింకెంత అర్భాటం చేస్తుందో అని - పరుగెత్తాను బయటికి. అమ్మ - ముందే చెప్పేసింది కాబోలు మేము కారెక్కే సమయానికి యిరుగు పొరుగు వాళ్లు పనులు మానుకుని మరీ వీధిలోకి వొచ్చి చూశారు. వాళ్ల భయమూ గౌరవమూ వాళ్లవి. మా అమ్మ నాకే కాదు చుట్టుపక్కల వాళ్లందరకీ అమ్మే. ఆవకాయ పెట్టాలన్నా అన్న ప్రాశన తలపెట్టినా, నోము నోచాలన్నా తగవు తీర్చాలన్నా అమ్మ సలహాయో సన్నిధో సహాయమో వాళ్ల కుండి తీరవలసిందే. అలా అలవాటు పడిపోయారు వాళ్లీ పెద్ద దిక్కుకి. అందుకే ఆవిడ మాట జవదాట లేక - కొడుకుతో కారెక్కుతూ కొండెక్కుతున్నంత సంబరపడుతున్న అమ్మను వాళ్లంతా పట్టీ పట్టీ చూశారు. వాళ్లు తనని చూడడాన్ని అమ్మ తృప్తిగా గర్వంగా చూసుకుంది - నాకైతే సిగ్గుగా ఉన్నా. ఆమేమో యీ కారు నాదనుకుంటోంది! పనివారు పది నిముషాలు ఆలస్యం నెపంతో వృధా చేయకుండానూ, ఇంపీరియల్‌కి ప్రచారం జరిగేందుకూ, దాని గురించి గొప్పగా నలుగురూ భావించాలనే తప్ప పనివారిని తీసుకురావడానికీ దిగ బెట్టడానికీ కారు ఏర్పాటు యాజమాన్యం పనివారి మీద ప్రేమతో చేసింది కాదని నాకు తెలుసు కాని అమ్మకి తెలియదు కదా? అమ్మలాటి అకాలపు వాళ్లకి కారులో యింటి కొచ్చే ఉద్యోగంటే కలక్టరే. నేను చదివిన చదువుకి కలక్టరే ఔతానని ఆమె ప్రగాఢ విశ్వాసం.

కారు తారు రోడ్డ మీద జారుతూంటే - ఆమె మాటలలోకి దిగింది. నాలో భయాల కందిరీగలూ సందేహాల తేనెటీగలూ. ఈసన్నివేశం, విషమ పరీక్ష. ఏమౌతుంది? ఎలా ముగుస్తుంది?

ఉత్కంఠ, భయం.. గుండె దడ.

"ఎందుకురా మాధవా ఆమౌనమూ ముభావమూ? కన్నతల్లికి ఆఫీసు చూపించడానికి కారులో తీసుకెళ్లడం కానిపనీ కొరగాని పనీ కాదే! దీన్లో సిగ్గు పడడానికేముందీ?"

"ఆహ.. అది కాదమ్మా."

"నీ భయం నాకు తెలుసురా. అక్కడంతా నీ తోటివారూ ఆఫీసర్లే ఉంటారు. ఈ ముసిలమ్మని చూబిస్తే ఏమనుకుంటారో అని అంతేనా? వెర్రి వాడా! మీ కుర్రాళ్లదయితే యీతరం కానీ అమ్మలదీ అమ్మమ్మలదీ అనాటి కాలమే కదా? ఎంత పెద్ద ఆఫీసరుకయినా అమ్మ ఉంటే ముసలిదేకద? అవ్వే కద? ఢిల్లీకి రాజయినా తల్లికి కొడుకే అన్న సామెత వినలేదూ? ఔనూ.. అబ్బాయ్, నీకింద ఎంత మంది ఉంటారూ? వందా? రెండొందలా?"

త్రుళ్లి పడ్డాను. అదృష్టవశాత్తూ డ్రయివరుకి తెలుగు తెలియదుకానీ, తెలిస్తే.. అమ్మ మాటలను బట్టి చిలవలూ పలవలూ ఊహించి నాగురించి ఇంపీరియల్‌లో నలుగురికీ కథలు చెప్పి.. నా బతుకు నవ్వులపాలు చేసేవాడేమో. అదిసరే.. తప్పిన ప్రమాదం. ఎదురవ బోయే ప్రమాదం గురించేం చెయ్యాలి? అమ్మ - ఇంపీరియల్‌ని చూస్తే.. తన బండారం బయట పడిపోతుందే..

"మాట్లాడవేం? నీకింద..." రెట్టించిందమ్మ

"వందకి పైనే ఉంటారమ్మా" అనేశాను - చటుక్కున. నేను పని చేసేది మూడో అంతస్తుకదా. అవిధంగా నేనబద్ధమాడినట్లూ కాదు.

కారు ఆగింది. నేను హడావిడిగా దిగి.. అమ్మని కారులోనే ఉంచి తలుపు వేసేస్తూ.. "అదేనమ్మా.. అభవనంలోనే నేను పని చేసేది -" అనేశాను.

"ఎంత పెద్ద భవంతో! ఎన్నెన్ని అంతస్తులో! ఎంత బాగుందో! నీ చదువుకీ తెలివితేటలకీ తగిన ఉద్యోగమే వొచ్చింది. చేసుకున్న వారికి చేసుకున్నంత. ఇల్లు చూసి ఇల్లాలిని చూడమన్నట్లే ఆఫీసుని చూసి ఉద్యోగిని చూడమనాలి. నీగది ఎన్నో అంతస్తులోనూ? ఆఫీసంతా నీదే అనుకో.. ఐనా.. నీగదంటూ.."

నేనామెను వినిపించుకోవట్లే.. డ్రయివర్‌కి హిందీలో నాప్రార్థన వినిపించుకున్నాను. "దయచేసి యీమెను మా యింటి దగ్గర విడిచిపెట్టు -" కారు కదిలింది.

"అదేమిట్రా మాధవా? కోవెల వరకూ తీసుకొచ్చి గర్భగుడి చూపనట్లు.. యింత వరకూ తీసుకొచ్చి నీ ఆఫీసూ, గదీ చూబించకుండా.."

ఆమె మిగిలిన మాటలు వినిపించకుండా.. ఆమె ముఖం కనిపించకుండా కారు వెళ్లి పోయిందప్పటికే నాకు దూరంగా దయ తలచినట్లు. కాని.. నాకు తెలుసు. నేనూహించుకోగలను అమ్మ మాటలూ మనోభావాలూ. ఎంత నిరాశ చెంది ఉంటుందో! ఎంత క్రుంగి పోయి ఉంటుందో! నేనెంత పాపాత్ముణ్ని!..

దుఃఖం ఆపుకోలేక - డ్రెస్సింగ్ క్యూబికల్‌లోకి పరుగెత్తుకొచ్చి ఏడ్చాను. జార్జ్! నేను హొటల్ సర్వర్‌నని అమ్మకి తెలియదు. తెలిస్తే భరించలేదు. ఎంతో చదువుకున్న తన కొడుకు - ఎంత ఐదు నక్షత్రాలదయినా ఒక హొటల్‌లో సర్వరంటే - ఆమె గుండె, కలలు.. ఊహలూ అన్నీ ఒక్కసారి పగిలిపోతాయి. తన కొడుకు రాజాలా.... కలక్టర్‌లా తప్ప హొటల్ సర్వర్‌గా బతకడమనేది ఆమెకత్యంత దుర్భరం. అందుకే - మొదటి నుంచీ ఆమెకు నిజం చెప్పలేక.. అబద్ధమాడలేక.. అర్ధ సత్యాలతో ఆత్మవంచన చేసుకుంటూ వొస్తున్నానీ ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ. నేనేం చెయ్యగలను? ఈ ఉద్యోగం కోసం నా అర్హతలు దాచుకున్నాను. అమ్మ కోసం.. ఆమె తృప్తి కోసం.. నా ఉద్యోగాన్ని దాచుకుంటున్నాను. జార్జ్! నేను పెళ్లెందుకు వాయిదా వేస్తున్నానో తెలుసా?" ఒక్కసారి తలెత్తి అడిగాడు.

"ఎందుకు?"

"రాబోయే అమ్మాయి ఎలాటిదౌతుందో? ఆమె ఎటువంటిదయినా అమ్మ ముందులా ఆమె ముందు నా ఉద్యోగం గురించి అబద్ధం చెప్పలేను నిజం దాచలేను. ఆమె కానీ ఎప్పుడైనా నోరు జారి -'అత్తగారూ! మీ అబ్బాయి ఐదు నక్షత్రాల హొటల్లో సప్లయరే..' అందో - మరినాకు అమ్మమిగలదు. ఆభయంతోనే.. అమ్మ గీసుకున్న నా చిత్రాన్ని చెరపనూ లేక మాననూ లేక" తాను పడుతున్న అంతర్మథనాన్ని అశ్రురూపంలో వెలి బుచ్చుతూ.. యిక మాట పెగలనట్లు మౌనంగా మిగిలి పోయాడు మాధవరావ్.

జార్జ్ - నివ్వెరపోయాడు.

పెద్ద చదువూ - చిన్న ఉద్యోగమూ ఐతే యిటువంటి సమస్యలా! పాపం, మాధవ్! అమ్మకోసం ఆత్మవంచనా, పరవంచనా చేసుకుంటున్నాడు! ఊరడింపుగా అతని తల నిమురసాగాడు.

ఏదయినా చెప్పి మాధవ్ మనసూ తేలికపరచాలనే ఉంది జార్జికి కానీ - యిటువంటి విచిత్ర విషాదంలో ఎవరు మాత్రం ఏం చెప్పగలరు?

❋